క్లుప్తంగా

జీజీహెచ్‌లో ఉచితంగా వైద్య పరీక్షలు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ యశస్వి రమణ సోమవారం తెలిపారు. అందుబాటులో లేని వైద్య పరీక్షలను ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద అతి తక్కువ ధరలకే 'గ్లోబల్ డయాగ్నస్టిక్స్, మెడైకాన్' అనే సంస్థకి కాంట్రాక్ట్ ఇచ్చినట్లు చెప్పారు. కాంట్రాక్టు దక్కించుకున్న ల్యాబ్‌ల రిక్విజేషన్ ఫామ్స్ అన్ని వార్డుల్లో, ఓపీ కౌంటర్లలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. చాలా మంది జీజీహెచ్ పేరు చెప్పుకొని ఎక్కువ రేట్లకు రక్త పరీక్షలు చేయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు సంబంధిత ల్యాబ్ నుంచి మాత్రమే ఐడీ కార్డుతో వారి టెక్నీషియన్స్ రక్త నమూనాలను సేకరిస్తున్నారన్న విషయాన్ని గుర్తించాలని చెప్పారు. ఎవరూ కూడా బయట ల్యాబ్స్‌కు రక్త పరీక్షలు ఇచ్చి మోసపోవద్దని సూచించారు.

దీనీ ఇజ్‌తిమా ఏర్పాట్లు చేయాలి



పెదకాకాని: దీనీ ఇజ్‌తిమా నిర్వహణకు ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. మండలంలోని నంబూరు డాంగేనగర్ సమీపంలో దీనీ ఇజ్‌తిమా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ నసీర్ అహ్మద్ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ జనవరి 11,12, 13 తేదీలతో జరిగే దీనీ ఇజ్‌తిమాకు గుంటూరు, కృష్ణా, ఏలూరు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడం జరుగుతుందన్నారు. వారికి అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో గుంటూరు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, డీఆర్వో ఖాజావలి, తహసీల్దార్ కృష్ణకాంత్, డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ టీపీ నారాయణస్వామి పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



గుంటూరు ఎడ్యుకేషన్: సీతారామనగర్‌లోని శ్రీసరస్వతి కమిటీ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు క్రీస్తు జననం రూపకాన్ని ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ డీవీ సుబ్బారావు మట్లాడుతూ క్రీస్తు జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని తెలిపారు. విద్యార్థులు సంప్రదాయ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఎం .వరలక్ష్మి, సంగటి సాంబశివరావు, హెచ్ఎం మానసవీణ, ఉపాధ్యాయులు సంగీత, అరుణకుమారి, నాగమేరీ, జయరాం పాల్గొన్నారు.

నేడు పెనుగొండ అభినందన సభ

లక్ష్మీపురం: కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అభినందన సభ మంగళవారం అవగాహన సంస్థ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. అరండల్‌పేట అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 6 గంటలకు కుబేరా టవర్స్ అరండల్‌పేట 15/1వ లైన్‌లో అభినందన సభ ఉంటుందని చెప్పారు.

30 నుంచి దశావతార కళ్యాణ మహోత్సవాలు

గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం(పెద్దగుడి)లో ఈనెల 30వ తేదీ నుంచి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన సొసైటీ ఆధ్వర్యంలో దశావతార కళ్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల ఆంజనేయులు తెలిపారు. సోమవారం గ్రామంలోని ఆలయంలో ఏర్పాటు చేసిన దశావతార బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పది రోజుల పాటు నిర్వహించే ఈ మహోత్సవాలలో మన రాష్ట్రంలో ఏ వైష్ణవాలయంలో జరగని విధంగా వైభవంగా కళ్యాణ మహోత్సవాలు జరుగుతాయని చెప్పారు. ప్రతి రోజు ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు.



విద్యుత్‌కాంతులతో పునీత ఆగ్నేసమ్మ దేవాలయం



విద్యుత్ కాంతులతో డాన్‌బాస్కో చర్చి



విద్యుత్‌కాంతులతో తూర్పు గురు మండలం చర్చి

చర్చిలు ముస్తాబు

గుంటూరు నగరం క్రిస్మస్ శోభ సంతరించకుంది. లోకరక్షకుని రాక కోసం భక్తులంతా సంసిద్ధులై నెల రోజుల నుంచి ఎదురుచూస్తున్న పర్వదినం రానుంది. ఈ నేపథ్యంలో ఇంటింటా క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని నక్షత్రాలు ఏర్పాటు చేశారు. ప్రసిద్ధ చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రీస్తు జననం గుర్తుగా అనేక చర్చిలలో పశువుల పాక ఏర్పాటు చేసి బాల ఏసుని భక్తిశ్రద్ధలతో పూజించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా నగరంలో క్రైస్తవులు ఉత్సవాల హడావుడి కనిపిస్తోంది. మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

'సీ' బిల్లులదే రాజ్యం

- అడ్డగోలుగా కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్న అధికారులు
- చేసే పని గోరంత సీ బిల్లు పెట్టేది కొండంత
- కౌన్సిల్ సభ్యులకు సక్రమంగా భోజనాలు పెట్టని వైనం



20వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో సీ బిల్లుల రాజ్యం నడుస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో చేపట్టే పనులకు సీ బిల్లు(ఎటువంటి అగ్రిమెంట్ లేకుండా) రూపంలో కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేస్తుంటారు ఇంజినీరింగ్ అధికారులు. అయితే ఈ సీ బిల్లులను అడ్డంపెట్టుకుని ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లకు కార్పొరేషన్ సొమ్మును దోచిపెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేసే పని గోరంత సీ బిల్లు పెట్టేది కొండంత అని అందరికి జగమెరిగిన సత్యం.

సభ్యులకు సరిగా భోజనాలు పెట్టని పరిస్థితి..

ఈ నెల 20వ తేదీన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మధ్యాహ్నం సమయంలో భోజనాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లకు సక్రమంగా భోజనాలు పెట్టలేదని సభ్యులు కౌన్సిల్ వేదికగా ప్రశ్నించారు. కనీసం ప్లేట్లు కూడా లేవని మేము మూడు నెలలకొకసారి వస్తాం.. కనీసం మాకు భోజనాలు పెట్టకపోతే ఎందుకు... ఇలా పిలిచి మమ్మల్ని ఇబ్బందులు పెట్టే బదులు.. భోజనాలు ఇంటి నుంచే క్యారేజ్ తెచ్చుకుంటామని కార్పొరేటర్లు ఆయిశెట్టి కనకదుర్గ, మర్రి అంజలి కౌన్సిల్ వేదికగా ప్రశ్నించారు.

నాసిరకం అల్పాహారం

కౌన్సిల్ సమావేశం ఉదయం నుంచి సాయంత్రం వరకు సుదీర్ఘంగా సాగుతుంది. అయితే ఉదయం, సాయంత్రం వేళల్లో సభ్యులకు టీ, స్నాక్స్ ఇస్తుంటారు. అయితే ఈ స్నాక్స్ కూడా నాసిరకంగా ఉంటున్నాయని సభ్యులు ఆరోపిస్తున్నారు. గత కౌన్సిల్ సమావేశంలో బూజు పట్టిన జీడీ పప్పు పెట్టారని కార్పొరేటర్ బాలాజీ కౌన్సిల్ వేదికగా నిలదీశారు. ఈ సారి జరిగిన కౌన్సిల్ సమావేశంలో నాసిరకం స్వీట్స్ పెట్టారని సభ్యులు బహిరంగంగా విమర్శించారు.

వంద మంది తింటే.. దానికి డబుల్ బిల్లులు..

కౌన్సిల్ సమావేశానికి మూడు వందల మందికి అని భోజనాలు సిద్ధం చేయించారు. అయితే సదరు భోజనాలు ఎవరికి సరిపోలేదు. కార్పొరేటర్లకు కూడా భోజనాలు అందించలేకపోయారు. సీ బిల్లు మాత్రం వంద మంది తింటే దానికి డబుల్ పెడుతుంటారనే ఆరోపణలు లేకపోలేదు. అదే విధంగా స్వీట్స్ బిల్లులో అధికంగా బిల్లు పెడుతున్నట్లు సమాచారం. గత కొద్ది రోజుల క్రితం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో కూడా మూడు వేల మందికి భోజనాలు పెట్టినట్లు సమాచారం. అయితే అంత మంది ఎక్కడ నుంచి వచ్చారనే ఆరోపణలు వస్తున్నాయి. కేవలం అధికారులు కాంట్రాక్టర్లకు దోచిపెట్టే తద్వారా తమ జేబులు నింపుకునే పనిలో ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతుంది.

నగరపాలక సంస్థ కార్యాలయ నిర్వహణ(టీ, స్నాక్స్, ఇతర అత్యవసర ఖర్చులు) కోసం ప్రతి నెల రూ.70 వేల వరకు సీ బిల్లు పెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ బిల్లుల ప్రాసెసింగ్‌లో ఇంజినీరింగ్ అధికారులు కీలకంగా వ్యవహరిస్తుంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అర్జీల రీ ఓపెన్ కాకుండా చూడాలి

అదనపు కమిషనర్ ఓబులేసు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ ఓబులేసు

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలు రీ ఓపెన్ కాకుండా సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 18 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలని కోరారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని కోరారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని చెప్పారు. సోమవారం ప్రజల నుంచి 42 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 11, ఇంజినీరింగ్ విభాగానికి 10, రెవెన్యూ విభాగానికి 7, ప్రజారోగ్య విభాగానికి 12, పరిపాలన విభాగానికి 1, ఉపా సెల్ విభాగానికి 1 చొప్పును ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

నర్సింగ్ ట్యూటర్‌కు సన్మానం



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ గ్రేడ్–2 ట్యూటర్, ఇన్‌చార్జిగా ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కోటా సుజతకు రెండు రోజుల క్రితం గ్రేడ్–1 నర్సింగ్ ట్యూటర్‌గా ప్రమోషన్ వచ్చింది. ఈనేపథ్యంలో సోమవారం పలువురు నర్సింగ్ ట్యూటర్లు, నర్సుల సంఘం నేతలు ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నర్సింగ్ ట్యూటర్లు వెల్లంపల్లి పద్మజ, ఎలిజిబెత్, చంద్రకళ, అనసూయ, వెంకటకుమారి, తాజున్నీసా, వర్ధిని పాల్గొన్నారు.

నగరమంతా క్రిస్మస్ సందడి

- ప్రార్థనాలయాలు ముస్తాబు
- జోరుగా సామగ్రి విక్రయాలు



పట్నంబజారులో ఓ దుకాణంలో అమ్మకానికి ఉంచిన క్రిస్మస్ స్టార్‌లు, ఇతర సామగ్రి

కొరిటిపాడు(గుంటూరు): క్రిస్మస్ సందడి వచ్చేసింది. ఊరూవాడా నక్షత్రాలతో వెలిగిపోతున్నాయి. క్రీస్తు జననం ప్రపంచానికి వేడుకైంది. పేదలు, పెద్దలు, చిన్నారులు తేడా లేకుండా చేసుకునే పండుగ. సాధారణంగా చాలా ప్రాంతాల్లో నెల రోజుల ముందు నుంచే విశ్వాసులు దీక్షలతో ప్రార్థనలతో ప్రారంభిస్తారు. అందరి ముంగిళ్లల్లోనూ క్రిస్మస్ ట్రీలు ప్రత్యక్షమవుతాయి. అందరి ఇళ్లకు రంగురంగుల నక్షత్రాలు వేలాడుతుంటాయి. క్రిస్మస్ అంటే కేవలం అలంకరణలు, రుచికరమైన వంటకాలు, అందమైన దుస్తులు, ఇచ్చిపుచ్చుకునే కానుకలు మాత్రమే కాదు. నిరాశ్రయులు, నిరుపేదలకు అండగా, ఆసరాగా నిలవాలన్న సందేశాన్ని క్రీస్తు రూపంలో ఇచ్చిన మహా పర్వదినమిది. పండుగ సందర్భంగా మనకోసం మనం ఎంత ఖర్చు చేశామన్నది కాకుండా పేదల కోసం కొంతైనా చేస్తున్నామా లేదా అన్నది క్రిస్మస్ అసలు పరమార్థం. డిసెంబర్ 25న శాంతాక్లాజ్ ప్రత్యేక్షమై చిన్నారులకు ఇష్టమైన బహుమతులు అందజేయడం ఆనవాయితీగా ఉంది.

ఆన్‌లైన్‌లో కూడా విక్రయాలు...

క్రైస్తవుల ముఖ్యమైన పండుగ అయిన క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించుకునేందుకు క్రైస్తవులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా క్రీస్తు జననానికి నిదర్శనమైన క్రిస్మస్ స్టార్‌లతో పాటు క్రిస్మస్ ట్రీలు, క్రిస్మస్ తాత బొమ్మలు, వెల్‌కమ్ బోర్డులు, విద్యుత్ తోరణాలు, శాంతాక్లాజ్ మాస్కులు వంటి క్రిస్మస్ సామాగ్రిలు దుకాణాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉంచడంతో క్రైస్తవులు భారీగా కొనుగోలు చేస్తుండటంతో సందడి వాతావరణం కనిపిస్తోంది. క్రిస్మస్ స్టార్‌లు సైజును బట్టి రూ.75 నుంచి రూ.700 వరకు ధర పలుకుతున్నాయి. అంతేకాకుండా క్రిస్మస్ సామగ్రి ఆన్‌లైన్ షాపింగ్‌లో కూడా అందుబాటులో ఉండటంతో కొంత మంది క్రైస్తవులు ఆన్‌లైన్ బుకింగ్‌కే మొగ్గు చూపుతున్నారు.

జోరుగా ఏర్పాట్లు..

క్రైస్తవులకు ముఖ్యమైన పండుగ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇదే సమయంలో క్రిస్మస్ పర్వదినాన ప్రార్థనల కోసం ఆయా చర్చిలను ముస్తాబు చేస్తున్నారు. అలాగే ఇళ్లలో ఏర్పాటు చేసుకునేందుకు క్రిస్మస్ ట్రీలు, క్రిస్మస్ స్టార్‌లు వంటి క్రిస్మస్ సామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి.

చర్చిలకు క్రిస్మస్ శోభ..

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని గుంటూరు నగరంలోని అన్ని క్రైస్తవ ప్రార్థనా మందిరాలు సుందరంగా ముస్తాబవుతున్నాయి. ప్రధానంగా లాడ్జి సెంటర్‌లోని సెయింట్ మాథ్యూస్ లూథరన్ నార్త్ ప్యారీస్ చర్చి, పాత బస్టాండ్ సెంటర్‌లోని ఫాదర్ హైయ్యర్ మెమోరియల్ చర్చి, నగరంపాలెంలోని పునీత అంతోని వారి పుణ్యక్షేత్రం, కన్నావారితోటలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి, మార్కెట్ సెంటర్‌లోని పరిశుద్ధ మత్తయి శత వార్షిక లూథరన్ చర్చిలను సుందరంగా అలంకరించారు. ఆయా మందిరాల ముందు భారీ క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేసి చర్చిలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.





పట్నంబజారులో ఓ దుకాణంలో



జిల్లా కోర్టు ఆవరణలో సెమీక్రిస్మస్ వేడుకలు



నగరంపాలెం: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ది గుంటూరు బార్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతీ హాజరై ప్రసంగించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, విశ్రాంత జడ్జి ఎన్‌జేసు రత్నకుమార్, పాస్టర్ రెవరెండ్ వై.యోహాన్ రాజు మాట్లాడారు. ది గుంటూరు బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి అనూరాధ, కోశాధికారి దేవదాసు, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, సీనియర్ న్యాయవాదులు ఎం.నాగేశ్వరరావు, డేవిడ్, లూదర్‌బాబు, సుధాకర్ పాల్గొన్నారు.

గరల్స్ హైస్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు



గుంటూరు ఎడ్యుకేషన్: వెంగళరావునగర్‌లోని నగరపాలకసంస్థ బాలికోన్నత పాఠశాలలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ శామ్యూల్‌రాజు క్రీస్తు సందేశాన్ని అందించారు. ఈసందర్భంగా మూడో తరగతి విద్యార్థి అవినాష్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వీర్ల త్రివేణి, వైస్ చైర్మన్ జంగల్ యెహోషువ పాల్గొన్నారు.

తమ్ముడే డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడంటూ నిరసన



మోసపోయానని ప్లకార్డుతో నిరసన వ్యక్తం చేస్తున్న వృద్ధురాలు తులసమ్మ

నెహ్రూనగర్: అవసరానికి విడతల వారీగా రూ.33.5 లక్షలు తీసుకుని తిరిగి అడిగితే నేను ఇవ్వను నీ దిక్కున్న చోట చెప్పుకోమని సొంత తమ్ముడే నన్ను మోసం చేయాలని చూస్తున్నాడని.. వృద్ధాప్యంలో ఉన్న తనకు తన డబ్బులు తిరిగి ఇప్పించేందుకు అధికారులు తగిన చొరవ తీసుకోవాలని కొరిటెపాడుకి చెందిన ఎస్.తులసమ్మ వాపోయారు. సోమవారం బ్రాడీపేటలోని తన తమ్ముడి దుకాణం వద్ద డబ్బులు ఇవ్వాలని కోరితే కోర్టులో చూసుకుందామని చెప్పడంతో ప్లకార్డులు షాపు ముందు తన మనవడు, అల్లుడితో కలసి నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా తులసమ్మ మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాల క్రితం పోస్ట్ ఆఫీసులో రూ.10 లక్షలు డిపాజిట్ చేయాలని తన తమ్ముడైన అప్పారావుకి ఇస్తే దానిని తన పేరు మీద డిపాజిట్ చేసుకున్నాడని, విడతల వారీగా తన అవసరాల కోసం మొత్తంగా రూ.33.5 లక్షలు తీసుకున్నాడని ఆరోపించారు. తన డబ్బులు ఇవ్వాలని తమ్ముడిని అడిగిప్పటికీ వృద్ధాప్యంలో ఉన్నావు... ఇప్పుడు నీకేందుకు డబ్బులు అంటూ హేళనగా మాట్లాడుతున్నాడని, పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తన తమ్ముడి వద్ద నుంచి డబ్బులు ఇప్పించాలని ఆమె కోరారు. దీంతో వివాదం పెద్దది కావడంతో అరండల్‌పేట పోలీసులు ఇరువర్గాల వారిని స్టేషన్‌కు తరలించారు.

కార్పొరేషన్ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ స్థలాన్ని ఆక్రమించుకుని దానిలో డెవలప్‌మెంట్ కోసం(అపార్ట్‌మెంట్ నిర్మించేందుకు) సదరు స్థలాన్ని వేరే ప్రైవేట్ కంపెనీకి కూడా ఇవ్వడం జరిగిందని గుంటూరు స్తంభాలగరువుకు చెందిన పంచుమర్తి శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం నగరపాలక సంస్థ పీజీఆర్ఎస్‌లో అదనపు కమిషనర్ ఓబులేసుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్తంభాల గరువులో నగరపాలక సంస్థ స్థలం, పొరంబోకు స్థలం సుమారు 500గజాల దాకా ఉందని, దీనిని అనుకుని 1276 గజాల స్థలాన్ని వేరే వ్యక్తులు కొనుగోలు చేశారని...దీని పక్కనే ఉన్న సుమారు 500 గజాల స్థలాన్ని కూడా ఆక్రమించుకుని చుట్టూ ప్రహరి గోడ నిర్మించుకున్నారని, దీంతో పాటు స్థలం ముందు 9 అడుగుల రోడ్డును మూసివేసి మా స్థలాన్ని కొంత భాగం ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం సదరు స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మించేందుకు శంకుస్థాపన కూడా జరిగిందని, అధికారులు స్పందించి తన స్థలాన్ని తనకు ఇప్పించడంతో పాటు, నగరపాలక సంస్థ స్థలాన్ని కాపాడాలని ఆయన కోరారు.